


ఏసీబీ వలలో సైట్ ఇంజనీర్

తెలంగాణ రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయాల సంస్థ జనగామ సబ్ డివిజన్ సైట్ ఇంజనీర్ సామల రమేశ్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. - 10లో▸



లక్ష్య సాధకులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు గురువారం టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో విజేతలుగా నిలిచారు. - 10లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం, సాయంత్రం పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

డీసీపీతో నేడు ఫోన్ ఇన్





జనగామ: సాక్షి ఆధ్వర్యంలో నేడు(శుక్రవారం) వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఉంటుంది. ఫోన్ ఇన్‌లో బతుకమ్మ, దసరా పండుగల వేళ దూరప్రయాణాలు, రాత్రి ప్రయాణాలు, సెన్సిబుల్ డ్రింకింగ్, సొంత ఊళ్లకు వెళ్లేవారు ఇళ్లలో చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీసీపీతో మాట్లాడవచ్చు. ఈ ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ క్రింది ఫోన్ నంబర్ కు కాల్ చేసి మాట్లాడాలి.

తేది : 26-09-2025, శుక్రవారం
ఫోన్ చేయాల్సిన నంబర్:
97053 46396
సమయం : ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు

న్యూస్‌రీల్

చోరీలు చేసిన వారిని అరెస్టు చేయాలి

- నెలవారీ నేర సమీక్షలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్

కేయూ క్యాంపస్: చోరీలు చేసిన వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. నిందితులను పట్టుకొని, చోరీలకు సంబంధించిన సొత్తు స్వాధీనం చేసుకున్నప్పుడే పోలీసులపై ప్రజలకు నమ్మకం గౌరవం పెరుగుతుందన్నారు. నిందితులు దేశంలో ఎక్కడ ఉన్నా అరెస్టు చేసేందుకు ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషిచేయాలన్నారు. పోలీస్‌స్టేషన్లలో ఆహ్లాదకర వాతావరణం కోసం మొక్కలు పెంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, వరంగల్, జనగామ ఏసీపీలు శుభం, చేతన్‌నితిన్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

28నుంచి మార్కెట్‌కు సెలవులు

జనగామ రూరల్: దసరా పండుగ సందర్భంగా ఖరీదుదారులు, అడ్తిదారుల కోరిక మేరకు ఈనెల 28 నుంచి అక్టోబర్ 3 వరకు ఆరు రోజులు జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న సాధారణ సెలవు, 29 సద్దుల బతుకమ్మ, 30 దుర్గాష్టమి, 1న మహర్నవమి, 2న గాంధీ జయంతి, విజయదశమి పండుగ, అలాగే 3వ తేదీన సెలవు ఉంటుందని, తిరిగి 4వ తేదీన మార్కెట్ యార్డు ప్రారంభం అవుతుందని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

శ్రీసోమేశ్వరాలయంలో సినీనటుడు సుమన్ పూజలు



పాలకుర్తి టౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్వయంభు శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం ప్రముఖ సినీనటుడు సుమన్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినీనటుడు సుమన్‌కు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సన్మానించి, స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకుడు దేవగిరి లక్ష్మన్న, అర్చకులు డీవీఆర్‌శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, మత్తగజం నాగరాజు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఆలయ సిబ్బంది, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

పట్టణంలో స్వచ్ఛతా హీ సేవా



జనగామ: పట్టణంలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శానిటేషన్‌తో పాటు ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది ఆర్టీసీ చౌరస్తా నుంచి హన్మకొండ రోడ్డులోని దయానిలయం వరకు రోడ్లపై చెత్తను తొలగించి, డ్రైనేజీల క్లీనింగ్ డ్రైవ్ చేపట్టారు.

నేటినుంచి మద్యం టెండర్లు

నోటిఫికేషన్ విడుదల..
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

- వచ్చే నెల 18 వరకు గడువు.. 23న లైసెన్స్‌ల కేటాయింపు
- లైసెన్స్ అప్లికేషన్ ఫీజు రూ.3లక్షలు
- కలెక్టరేట్‌లో రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తి



కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ

జనగామ: జిల్లాలో నూతన మద్యం దుకాణాల టెండరు ప్రక్రియ మొదలుకానుంది. వైన్స్‌ల కేటాయింపులో రిజర్వేషన్ల ప్రాసెస్ గురువారం పూర్తికాగా, ఈనెల 26 (శుక్రవారం) నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ఎక్సైజ్ శాఖ సన్నద్ధమవుతోంది. ప్రస్తుత దుకాణాల కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ చివరి వారంతో ముగియనుండగా, ప్రభుత్వం ముందస్తుగా కొత్త టెండర్లను ఆహ్వానిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు 47 మద్యం దుకాణాలు ఉండగా, ఈసారి మరో మూడు కొత్త దుకాణాలు పెరగడంతో మొత్తం సంఖ్య 50కి చేరింది. వీటిలో ఎస్టీ వర్గానికి 1, ఎస్సీ సామాజిక వర్గానికి 5, గౌడ కులస్తులకు 13, జనరల్ కేటగిరీ(ఓపెన్) విభాగంలో 31 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించారు. దీంతో ప్రస్తుత వైన్స్ యజమానులతో పాటు కొత్త ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న ఆయా వర్గాల వారు టెండర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

కలెక్టరేట్‌లో లాటరీ ప్రక్రియ

నూతన మద్యం దుకాణాల కేటాయింపుల్లో రిజర్వేషన్ల కోసం గురువారం కలెక్టరేట్‌లో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి అనిత, ఏఈఎస్ ప్రవీణ్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులతో కలిసి ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ పర్యవేక్షణలో మద్యం దుకాణాల రిజర్వేషన్ల కోసం లక్కీ లాటరీ నిర్వ హించారు. జిల్లాలో 50 మద్యం షాపులకు గాను 19 షాపులకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఇందులో గౌడ సామాజిక వర్గానికి-13(15 శాతం), ఎస్సీ సామాజిక వర్గానికి -5(10 శాతం), ఎస్టీ సామాజిక వర్గానికి-1(5శాతం) మద్యం దుకాణాలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. జనరల్‌కు-31 (74శాతం) కేటాయించారు. గౌడ కేటగిరీలో జిల్లాలోని మునిసిపల్‌తో పాటు మండలాల వారీగా మద్యం దుకాణాల వారీగా నెంబర్లు కేటాయించగా, ఏరియాలతో సహా గెజిట్‌లో పొందుపరిచారు.

కొత్త పాలసీ ఇలా

నూతన మద్యం పాలసీలో లైసెన్స్ అప్లికేషన్ ఫీజు 50శాతం పెంచుతూ రూ.3లక్షలు నిర్ణయించారు. లైసెన్స్ కోసం ఇచ్చే డబ్బులను తిరిగి చెల్లించరు. నూతన లైసెన్స్ కాలపరిమితి 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు రెండేళ్ల పాటు అమలులో ఉంటుంది.

కొత్తగా మూడు వైన్స్‌లు

జిల్లాలోని జనగామ పట్టణం, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలో మూడు మద్యం దుకాణాలు కొత్తగా పెరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరగడంతో ఉమ్మడి జిల్లా పరిధిలో మూతబడేందుకు సిద్ధంగా ఉన్న మూడింటిని ఇక్కడకు కేటాయించారు. లాటరీ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ అధికారి ప్రేమకళ, బీసీ వెల్ఫేర్ అధికారి ఎన్.ఎల్. నర్సింహారావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.విక్రమ్, ఎక్సైజ్ సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

మండలాల వారీగా మద్యం దుకాణాలు, రిజర్వేషన్లు

మండలం	వైన్స్‌లు	జనరల్	గౌడ	ఎస్సీ	ఎస్టీ
జనగామ మునిసిపల్	11	06	04	01	-
పెంబర్తి	01	01	-	-	-
లింగాలఘణపురం, (నెల్లుట్ల)	03	01	01	01	-
నర్మెట	02	01	01	-	-
బచ్చన్నపేట	03	02	01	-	-
చిల్పూరు (చిన్న పెండ్యాల)	01	01	-	-	-
చిల్పూరు (కరుణాపురం)	01	-	-	01	-
స్టే.ఘన్‌పూర్	08	05	02	-	01
తరిగొప్పుల	02	01	01	-	-
రఘునాథపల్లి	04	02	-	02	-
పాలకుర్తి	05	03	02	-	-
కొడకండ్ల	03	03	-	-	-
జఫర్‌గఢ్	03	03	-	-	-
దేవరుప్పుల	03	02	01	-	-
మొత్తం	50	31	13	05	01

రిటైల్ దుకాణాలకు ఎక్సైజ్ ట్యాక్స్

జనాభా ప్రాతిపదికన లిక్కర్ దుకాణాలకు ఎక్సైజ్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో రూ.50లక్షలు, రూ.55లక్షలు, రూ.60 లక్షల స్లాబులు ఉన్నాయి. 5వేల జనాభా కలిగిన ఊర్లకు రూ.50లక్షలు, 5వేల నుంచి 50వేల వరకు రూ.55లక్షలు, 50వేల నుంచి లక్ష వరకు రూ.60లక్షలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. 2025–27 రెండేళ్ల కాల పరిమితి సమయంలో ఆరు సమాన వాయిదాలతో ఎక్సైజ్ పన్ను చెల్లించాలి.

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

2025–27 సంవత్సరాలకు(రెండేళ్లు) గాను శుక్రవారం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుంది. జిల్లా కేంద్రం వడ్లకొండ రోడ్డు ఇరిగేషన్ క్వార్టర్స్‌లోని డిస్ట్రిక్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ స్టేషన్ల వారీగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులు రూ.3లక్షల చలాన్‌తో పాటు ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌లను అప్లికేషన్‌తో జతపర్చాలి. ఒకవేళ రిజర్వేషన్ కేటగిరిలో ఉన్నవారు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలి. ఈ నెల26 నుంచి వచ్చే నెల(అక్టోబర్)18వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 23న కలెక్టర్ నేతృత్వంలో లాటరీ నిర్వహించి, మండలాల వారీగా మద్యం దుకాణాల కేటాయింపులు చేస్తారు. ప్రస్తుత వైన్స్ దుకాణాల టెండరు నవంబర్ 30 వరకు ఉండగా, లాటరీలో దక్కించుకున్న నూతన వ్యాపారులు డిసెంబర్ 1వ తేదీ నుంచి నూతన మద్యం దుకాణాలను ఓపెన్ చేస్తారు. గతంలో 2023– 25 మద్యం పాలసీ సమయంలో జిల్లాలో 47 మద్యం దుకాణాల కోసం 2,356కు పైగా టెండర్లను దాఖలు చేశారు. ఇందుకు ఎక్సైజ్ శాఖకు రూ.47.12 కోట్ల మేర ఆదాయం (నాన్ రిఫండబుల్) సమకూరింది. జిల్లాలో నెలకు రూ.20కోట్ల మేర లిక్కర్, బీర్ల అమ్మకాలు జరుగుతుండగా, ఇప్పటివరకు రూ.420 కోట్ల మేర వ్యాపారం జరిగింది.

జేఎస్‌జేబీలో జిల్లాకు రూ.కోటి నజరానా

- కలెక్టర్ చొరవ..30,569 ఇంకుడు గుంతల నిర్మాణం
- ప్రశంసలు కురిపించిన కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ



ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న కేంద్ర ప్రతినిధులు(ఫైల్)

జనగామ: జల సంరక్షణలో సామూహిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ అద్భుత ఫలితాలు సాధించినందుకు గాను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా ఎంపిక చేయగా, జనగామ జిల్లాకు రూ.కోటి నజరానా ప్రకటించింది. 2024 ఏప్రిల్ నుంచి 2025 మే వరకు నిర్వహించిన జలసంచయ్–జన భాగీదార్(జేఎస్‌జేబీ 1.0) ప్రోగ్రాంలో జల రీచార్జ్ నిర్మాణాల (సోక్‌పిట్స్, రూఫ్‌టాప్ వర్షపు నీరు సేకరణ, బోర్‌వెల్ రీచార్జ్, చెక్‌డ్యాంలు, సబ్‌సర్ఫేస్ డైక్స్, ఫార్మ్ పాండ్స్, పర్కొలేషన్ ట్యాంకులు)ను పూర్తి చేసి, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనివలన వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీచార్జ్ బలోపేతమైనట్లు కేంద్రం గుర్తించి, నీటి సంరక్షణ కోసం కృషి చేసిన వారికి జాతీయ స్థాయిలో గుర్తింపునిచ్చింది. జిల్లాలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు శాఖలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వామ్యులు కావడంతో 12 మండలాల పరిధిలో 30,569 ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టి, జాతీయ స్థాయిలో నగదు పురస్కారానికి జనగామ ఎంపికైంది. జిల్లా అవార్డుల్లో జనగామకు రూ.కోటి నజరానా ప్రకటించారు. ప్రజల భాగస్వామ్యంతో సాధించిన ఈ విజయాన్ని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా ప్రశంసించింది. జాతీయ స్థాయిలో జనగామకు ఉత్తమ బహుమతి రావడానికి కారణమైన ప్రతి ఒక్కరికి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అభినందించారు

క్రీడారంగంలో రాణించాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్
- ఇంటర్ డిస్ట్రిక్ ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడల ప్రారంభోత్సవంలో కోచ్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్

జనగామ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో సైతం రాణించి దేశ ప్రతిష్టను నిలబెట్టే విధంగా కష్టపడాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకులంలో గురువారం 69వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్ 19 విభాగంలో జరిగిన ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రారంభించారు. సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన క్రీడాపోటీల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ కల్నల్ భిక్షపతి, జిల్లా ఫుట్‌బాల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అజ్మీరా కిషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్ల ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి రాజయ్య, మహేంద్ర వర్మ, టీజీపేట అధ్యక్షుడు కోర్‌సింగ్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, కోచ్‌లు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ శ్రమదానం చేయాలి..

జనగామ రూరల్: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ శ్రమదానం చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ అన్నారు. 17వ స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమం అమలులో భాగంగా గురువారం మండలంలోని శామీర్‌పేట్ గ్రామంలో ఏక్ దిన్ ఏ గంట ఏక్ సాత్ అనే కార్యక్రమం పురస్కరించుకొని శ్రమదాన కార్యక్రమం ప్రారంభించి స్వయంగా పాల్గొన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛ పండాల్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి స్వరూప, జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ కరుణాకర్, జిల్లా అదనపు పీడీ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సంపత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు చాకలి ఐలమ్మ జయంతి

జనగామ రూరల్: తెలంగాణ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ప్రభుత్వం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ పింకేశ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, రజక కులస్తులు, ఇతర కులసంఘాల నాయకులు, జిల్లా అధికారులు, సిబ్బంది భారీసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్: విద్యార్థులకు రాజ్యాంగం, చట్టాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని ఏకశిలా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని దేశంలోని ప్రతి పౌరుడు తెలుసుకొని అనుసరించాలని, రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తే శిక్ష తప్పదు అని అన్నారు. ప్రాథమిక విధులు, బాధ్యతలు గురించి తప్పకుండా తెలుసుకోవాలని అలాగే పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎ. మల్లికార్జున రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ జి.నళిని కుమారి, డైరెక్టర్ బి.నాగరాజు, బి.శేఖర్, పి.జితేంద్ర పాల్గొన్నారు.

‘బెస్ట్ అవైలబుల్’ బిల్లులు విడుదల చేయాలి

- అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న తల్లిదండ్రులు

జనగామ రూరల్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పెండింగ్ బిల్లులు విడుదల చేసి తమ పిల్లల చదువులకు సహకరించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు వినతిపత్రం అందజేశారు. దేవరుప్పుల మండలంలోని కడవెండి సెయింట్ జాన్ బ్రిట్టో హైస్కూల్‌లో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 2017 సంవత్సరం అడ్మిషన్లు ఇచ్చారు. కానీ 2021 నుంచి 2025 ఈరోజు వరకు నిధులు విడుదల కాలేదని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు..

జనగామ రూరల్: భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ అన్నారు. గురువారం స్టేషన్ ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలో చేపడుతున్న సాదాబైనామా, భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను ఆకస్మికంగా సందర్శించి అసైన్డ్ భూములు 22–ఏను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీతోనే దేశ సమగ్ర అభివృద్ధి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిశోర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిశోర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రంలో బీజేపీ పాలనలో ప్రధాని నరేంద్రమోదీ ద్వారానే దేశ సమగ్ర అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిశోర్‌రెడ్డి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో జీఎస్టీపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలోని అంజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన కిశోర్‌రెడ్డి మాట్లాడారు.. జీఎస్టీ తగ్గించడం సర్వత్రా హర్షణీయమన్నారు. వెన్నుపోటు రాజకీయాలు చేయడంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఐకాన్ అని బీజేపీ నేత, మాజీ మంత్రి విజయరామారావు ఆరోపించారు. రాజ్యాంగంపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, నాయకులు ఇనుగాల యుగేందర్‌రెడ్డి, సట్ల వెంకటరమణ, బూర్ల విష్ణు, ఆరూరి జయప్రకాశ్, శశిధర్‌రెడ్డి, గంటె ఉపేందర్, నవీన్, చట్ల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ మహిళలకు భరోసా

- ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన పథకంతో లబ్ధి
- ఒంటరి మహిళలకు రూ.50 వేల ఆర్థిక సాయం
- రేవంతన్న కా సహారా మిస్కీన్ లే కింద రూ.లక్ష గ్రాంట్



జనగామ రూరల్: మైనారిటీల అభ్యున్నతి కోసం, వారు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా మైనారిటీ మహిళల ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించడానికి రెండు కొత్త పథకాలను ప్రవేశపెట్టింది. ‘ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన’, ‘రేవంతన్నకా సహారా మిస్కీన్ లే’ పేరుతో వచ్చిన పథకాలు మహిళల ఆర్థిక స్వావలంబన, అట్టడుగు సముదాయాల సామాజిక ఉద్ధరణకు దోహదపడతాయి. ఈనెల 19న సెక్రటేరియేట్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం రూ.30 కోట్ల బడ్జెట్‌తో అమలు చేసే ఈ పథకాలకు దరఖాస్తులు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 6 వరకు టీజీవోబీఎమ్ ఎమ్ ఎస్ ఆన్‌లైన్ ద్వారా స్వీకరించనున్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. ఆర్థిక ఎదుగుదలకు ఈ పథకాలు ఉపయోగపడనున్నాయి. జిల్లాలో అర్హులైన మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలి.

-జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి.విక్రమ్‌కుమార్

ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన

ఈ పథకం మైనారిటీ మహిళలు (ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ వర్గాలకు చెందినవారు) స్వతంత్రంగా ఆర్థికంగా ఎదగడానికి సహాయపడుతుంది. వితంతువులు, విడాకులు పొందినవారు, అనాథలు, అవివాహితలు, ఒంటరి మహిళలకు చిన్న వ్యాపారాల ప్రారంభానికి ఒక్కొక్కరికీ రూ.50 వేల గ్రాంట్ అందిస్తారు. ఇది రాష్ట్రంలో మైనారిటీ మహిళల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, ఉద్యోగాల సృష్టికి దోహదపడనుంది.

అర్హతలు: స్థానికులుగా ఉండి మైనారిటీ వర్గాలకు చెందినవారు
వయసు: 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి
విద్యార్హత: కనీసం 5వ తరగతి
వార్షిక ఆదాయం: గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షలకు తక్కువ
గత ఐదేళ్లలో ఇతర ఆర్థిక సహాయాలు పొందిఉండకూడదు
అవసరమైన పత్రాలు: రేషన్ కార్డు, ఆధార్, వయసు, ఆదాయ ఆధారాలు

రేవంతన్నకా సహారా మిస్కీన్ లే..

ముస్లిం సముదాయాల అభ్యున్నతికి ఈ పథకం రూపొందించబడింది. ఫకీర్, దూదేకుల, ఇతర అట్టడుగు ముస్లిం వర్గాల సభ్యులకు మోపెడ్లు, బైక్లు లేదా ఈ–బైక్‌లు అందించడానికి రూ.లక్ష గ్రాంట్ 100శాతం రాయితీతో మంజూరు చేస్తారు. తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్సీ) ద్వారా అమలు చేసే ఈ చర్య ఆర్థిక బలహీనతను తగ్గించి, రోజువారీ జీవనాన్ని మెరుగుపరుస్తుంది.

అర్హతలు: తెలంగాణ స్థిరనివాసులు, మైనారిటీ వర్గాలకు చెందినవారు
వయసు: 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి
- రేషన్ లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉండాలి
- గత ఐదేళ్లలో టీజీఎంఎఫ్సీ నుంచి సహాయం పొందిఉండకూడదు
- కుటుంబానికి ఒక్కరికి మాత్రమే ప్రయోజనం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మచ్చుపహాడ్ విద్యార్థి



గజ్జెల్లి జీవన్

నర్మెట: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మచ్చుపహాడ్‌కు చెందిన గజ్జెల్లి జీవన్ ఎంపికయ్యాడు. నిజామాబాద్ ముప్కాల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో పాల్గొని ఎంపికైన జీవన్ జనగామ ఏకశిలా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. రెండోసారి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో మచ్చుపహాడ్ స్పోర్ట్స్ అధ్యక్షుడు కాసు కనకరాజు, గ్రామస్తులు గురువారం అభినందించారు. ఈసందర్భంగా జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి గట్టయ్య, మండల అధ్యక్షుడు గుండేటి రాంచందర్, కార్యదర్శి కొంపెల్లి అంబేడ్కర్, సభ్యులు గొల్లపల్లి రాజు, వినోద్ , వేణు హర్షం వ్యక్తం చేశారు.

క్రీస్తుజ్యోతిలో బతుకమ్మ సంబురాలు



సీజేఐటీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

జనగామ: మండలంలోని యశ్వంతాపూర్ క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. బతుకమ్మలను తీర్చిదిద్ది కళాశాల ఆవరణలో సాయంత్రం నుంచి రాత్రి వరకు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా సంప్రదాయ, ఆచార వ్యవహారాలను సైతం గౌరవించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు స్వప్న, సంతోశకుమారి, స్వర్ణ, సరితా, మాలతి, గీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్

జనగామ రూరల్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌కు విద్యార్థినుల తల్లిదండ్రులు హాజరుకావాలని ప్రిన్సిపల్ ఎస్.సునంద గురువారం తెలిపారు. ఇంటర్ విద్యా కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



ఓపెన్‌కాస్టులోకి చేరిన వర్షపు నీరు

భూపాలపల్లి అర్బన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా గురువారం భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఏరియాలోని కేటీకే ఓపెన్ కాస్టు -2,3 ప్రాజెక్టుల్లో మూడు షిఫ్టుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల్లోని పని స్థలాల్లో వర్షపు నీరు వచ్చి చేరింది. గని ఆవరణలో రోడ్లు బురదగా మారాయి. దీంతో సుమారు 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఓపెన్‌కాస్టులో చేరిన వర్షపు నీటిని భారీ మోటార్లు ఏర్పాటు చేసి బయటకు ఎత్తిపోస్తున్నారు.

కరాటేతోనే హీరో అయ్యాను..

- ప్రముఖ సినీ నటుడు సుమన్



మాట్లాడుతున్న సినీ నటుడు సుమన్

పాలకుర్తి టౌన్: కరాటే, మార్షల్ ఆర్ట్స్ ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వం, గుణాన్ని మెరుగుపరుస్తాయని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్‌లో కరాటే శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై కరాటేలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటేతో తాను హీరో అయ్యానని, సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి 48 ఏళ్లు అవుతోందని తెలిపారు. ఇప్పటి వరకు వివిధ భాషల్లో 800 చిత్రాల్లో నటించానని, తెలుగులో 100 సినిమాల్లో హీరో రోల్ చేశానని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కరాటేలో శిక్షణ ఇప్పించాలని సూచించారు. వరంగల్‌కు చెందిన కరాటే మాస్టర్ యాకూబ్ మృతి చెందడం బాధాకరం అన్నారు. డబ్ల్యూఎఫ్ చీఫ్ హసన్ మాట్లాడుతూ సుమన్ లాంటి గొప్ప నటుడు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావడం సంతోషంగా ఉందన్నారు. కరాటే ముఖ్యంగా బాలికలకు అత్యవసరమన్నారు. తెలంగాణ అధ్యక్షుడు చంద్రశేఖర్, మాస్టర్లు అన్వర్, షీటీం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



వీరయ్య మృతదేహం

తొర్రూరు రూరల్: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని అరిపిరాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి వీరయ్య(56) పశుగ్రాసం కోసం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పచ్చిగడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు సర్వీస్ వైరుకు కొడవలి తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మితోపాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రభుత్వం వీరయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.

లక్ష్య సాధకులు..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఆషామాషీ కాదు. దీనికి కఠోర తపస్సు చేయాలి. క్షేత్ర స్థాయి నుంచి మొదలు.. ఉన్నత స్థాయి వరకు పోస్టులు వందల్లో ఉంటే దరఖాస్తులు లక్షల్లో ఉంటున్నాయి. ఈ తరుణంలో అర మార్కు కూడా అత్యంత విలువైంది. అందుకే విజయం వరించాలంటే పుస్తకాలతో నిత్యం కుస్తీ పట్టాలి.. దోస్తీ కట్టాలి. క్షణం కూడా వృథా చేయకుండా లక్ష్యం వైపు సాగాలి. అప్పుడే విజేతలుగా నిలుస్తాం. సరిగ్గా ఇదే సూత్రాన్ని పాటించిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు బుధవారం అర్ధరాత్రి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో విజేతలుగా నిలిచారు. పలు ఉన్నత స్థాయి కొలువులను దక్కించుకున్నారు. వారి విజయగాథలపై ప్రత్యేక కథనం..

అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా పవన్‌కల్యాణ్..



గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన గంగావత్ పవన్‌కల్యాణ్ గ్రూప్–1లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. కాగా, పవన్‌కల్యాణ్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటి నుంచి ఇంటర్ వరకు, ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ పూర్తి చేశారు. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–1లో 454 మార్కులు సాధించి ఎస్టీ విభాగంలో 527వ ర్యాంకు పొంది ట్రెజరీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌లో ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమన్నారు.

ఎంపీడీఓగా ఎదుళ్లపల్లి వాసి..



రవికుమార్

కొత్తగూడ: మండలంలోని ఎదుళ్లపల్లి గ్రామానికి చెందిన కూస రవికుమార్ గ్రూప్–1లో సత్తా చాటి ఎంపీడీఓగా ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన కూస కొమురయ్య, రమాదేవి దంపతుల కుమారుడు రవికుమార్ ఎంపీడీఓగా ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రేడ్–2 మున్సిపల్ కమిషనర్‌గా ఉదయ్‌కుమార్



రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ఉదయ్‌కుమార్ గ్రూప్–1 ఫలితాల్లో గ్రేడ్–2 మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన కొయ్యడ ప్రభాకర్– లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు ఉదయ్‌కుమార్ రఘునాథపల్లి తేజస్వి స్కూల్‌లో పదో తరగతి వరకు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో పాలిటెక్నిక్ , ఘట్‌కేసర్ విజ్ఞాన భారతిలో బీటెక్, నిజాంకాలేజీలో ఎంబీఏ పూర్తి చేశారు. కాగా, గతేడాది డిసెంబర్‌లో సింగరేణిలో పర్సనల్ మేనేజర్ ఉద్యోగం సాధించి విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎంపీడీఓగా తరుణ్‌ప్రసాద్..



నయీంనగర్/కేయూ క్యాంపస్: గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ శ్రీనగర్ కాలనీకి చెందిన రావుల జగదీశ్వర్ ప్రసాద్, శ్రీదేవి దంపతుల కుమారుడు తరుణ్‌ప్రసాద్ ఎంపీడీఓ పోస్టుకు ఎంపికయ్యారు. తరుణ్‌ప్రసాద్ కిట్స్ వరంగల్‌లో బీటెక్ పూర్తిచేసి గ్రూప్–1 కు ప్రిపేర్ అవుతూ మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, బంధుమిత్రులు తరుణ్‌ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా తేజస్వినిరెడ్డి..



గార్ల/శాయంపేట: గార్ల ఎంపీఓ జె. తేజస్వినిరెడ్డి గ్రూప్–1లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికయ్యారు. 532.5 మార్కులు సాధించి స్టేట్ 4వ ర్యాంకు సాధించారు. దీంతో తేజస్వినిరెడ్డిని ఎంపీడీఓ మంగమ్మ, తహసీల్దార్ శారద, సీనియర్ అసిస్టెంట్ రాజేశ్, సూపరింటెండెంట్ ఉదయశ్రీ, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా వైష్ణవి..



రాయపర్తి: మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన పుల్లూరి రఘుబాబు, నాగరాణి దంపతుల పెద్ద కుమార్తె వైష్ణవి గ్రూప్–1లో 120 ర్యాంకు సాధించి కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికయ్యారు. వైష్ణవి.. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీలో, డిగ్రీ మెరండ హౌజ్ ఢిల్లీ యూనివర్సిటీలో చదివారు. కాగా, వైష్ణవికి తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. వీరు ప్రస్తుతం వరంగల్ కాశిబుగ్గ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నారు.

డీఎస్పీగా దైనంపల్లి ప్రవీణ్..



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని మానసపల్లికి చెందిన దైనంపల్లి ప్రవీణ్‌కుమార్‌కు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల్లో 105 ర్యాంకు సాధించారు. మల్టీజోన్–1లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) పోస్టుకు ఎంపికయ్యారు. కాగా, ప్రవీణ్ ప్రస్తుతం యూపీఎస్సీ మెయిన్స్ కూడా రాసి ఆ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు.

ఎంపీడీఓగా సుధీర్..



ఎల్కతుర్తి: టీజీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొక్క జయ–సుధాకర్ కుమారుడు సుధీర్ 437.5 మార్కులతో ఎంపీడీఓ ఉద్యోగం సాధించారు. హుస్నాబాద్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి, హనుమకొండలో ఇంటర్, హుజూరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశారు. 2023లో సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. ఇంటి వద్ద ప్రిపేరై మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–1లో ఎంపీడీఓ ఉద్యోగం సాధించారు.

మున్సిపల్ కమిషనర్‌గా రాజశేఖర్‌రెడ్డి..



బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన చిమ్ముల రాజశేఖర్‌రెడ్డి గ్రూప్–1లో మున్సిపల్ కమిషనర్ పోస్టుకు ఎంపికయ్యారు. రాజశేఖర్‌రెడ్డి పదో తరగతి బచ్చన్నపేట ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్మీడియట్ ఏపీఆర్‌జేసీ నిమ్మకూర్‌లో, బీటెక్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో పూర్తి చేశారు. 2014లో ఏపీపీఎస్సీలో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన రాజశేఖర్‌రెడ్డి 2024లో గ్రూప్–4లో 279 ర్యాంకు సాధించారు. గ్రూప్–2లో 424 మార్కులు సాధించి రాష్ట్ర 8వ ర్యాంకర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు చిమ్ముల అరుణ, మల్లారెడ్డితోపాటు గ్రామస్తులు రాజశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఏసీబీ వలలో సైట్ ఇంజనీర్ రమేశ్

- రూ. 8వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీకి పట్టుబడిన సైట్ ఇంజనీర్ సామల రమేశ్

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఈడబ్ల్యూ ఐడీసీ)జనగామ సబ్ డివిజన్ సైట్ ఇంజనీర్ (ఔట్ సోర్సింగ్) సామల రమేశ్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. హనుమకొండ డీఈఓ కార్యాలయంలోని జనగామ సబ్ సబ్ డివిజన్ ఆఫీస్‌లో గురువారం ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 8వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారుల(ఏసీబీ)కు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ జిల్లా కొడకండ్ల జెడ్పీహెచ్ఎస్‌కు పీఎం శ్రీ పథకం కింద సైన్స్‌ల్యాబ్‌కు రూ. 13లక్షల 50వేలు మంజూరు కాగా గది నిర్మించారు. ఆ నిర్మాణం చేయించినవారికి ఇప్పటికే కొంత బిల్లు ముట్టింది. ఫైనల్ బిల్లు కింద రూ. 3లక్షల 50వేలు చెల్లించాల్సిండగా ఆ బిల్లు ప్రాసెస్ చేసేందుకు ఫార్వర్డ్ చేయడానికి సైట్‌ఇంజనీర్ సామల రమేశ్.. ఆ సైన్స్‌ల్యాబ్ గదిని నిర్మించిన వ్యక్తిని రూ. 18వేల లంచం డిమాండ్‌చేశారు.ఆ వ్యక్తి తొలుత రూ. 10వేలు ఫోన్ పే ద్వారా సైట్ ఇంజనీర్ రమేశ్‌కు కొద్దిరోజుల క్రితం చెల్లింపు చేశారు. మిగతా రూ. 8వేలు చెల్లిస్తేనే ఫైనల్ బిల్లు చెల్లింపునకు సంబంధించి ప్రక్రియ పూర్తవుతందని రమేశ్ చెప్పడంతో అతను (ఫిర్యాదుదారుడు) ఏసీబీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం హనుమకొండ డీఈఓ కార్యాలయంలోని టీజీఈడబ్ల్యూ ఐడీసీ జనగామ సబ్‌డివిజన్ ఆఫీస్‌లోనే సైన్స్ ల్యాబ్‌ను నిర్మాణం చేయించిన వ్యక్తి నుంచి రూ.8వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఎల్ రాజు, ఎస్‌రాజు.. రమేశ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం జనగామ సబ్‌డివిజన్ టీజీఈడబ్ల్యూ ఐడీసీ కార్యాలయంలో సోదాలు కొనసాగించారు. పలు రికార్డులు పరిశీలించారు. రమేశ్ వరంగల్ ప్రాంతానికి చెందిన వ్యక్తని, అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. కాగా, రమేశ్ ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో ఆ ఇంజనీరింగ్ విభాగంలోని వివిధ జిల్లాల అధికారుల్లో గుబులు రేపుతోంది.

మావోయిస్టు దళ సభ్యుడి లొంగుబాటు?

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన మావోయిస్టు దళ సభ్యుడు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిసింది. ప్రస్తుతం అతడు ఛత్తీస్‌గఢ్‌లో దళ సభ్యుడిగా పనిచేస్తున్నట్లు సమాచారం. అతడిపై ప్రభుత్వం రివార్డు ప్రకటించింది. వంగపహాడ్‌కు చెందిన అతడు బాల్యంలో పశువుల కాపరిగా పనిచేసే వాడు..అయితే విప్లవసాహిత్యానికి ఆకర్షితుడై 40ఏళ్ల క్రితం పొరుబాట పట్టినట్లు స్నేహితులు చెబుతున్నారు. అజ్ఞాతంలోకి వెళ్లిన అతడు ఇప్పటి వరకూ వంగపహాడ్‌కు రాలేదని స్థానికులు తెలిపారు.

మండలంలో మావోయిస్టు కేడర్ సమాప్తం..

హసన్‌పర్తి మండలంలో 20 మంది వరకు విప్లవసాహిత్యానికి ఆకర్షితులై పొరుబాట పట్టారు. క్రమేణ ఒక్కొక్కరు పోలీసులు ఎదుట లొంగిపోయారు. చివరికి చింతగట్టుకు చెందిన రాకేశ్‌తోపాటు వంగపహాడ్‌కు చెందిన వ్యక్తి మాత్రం ఛత్తీస్‌గఢ్ ఏరియాలో పనిచేస్తున్నారు. అయితే ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రాకేశ్ మృతిచెందగా వంగపహాడ్‌కు చెందిన మరో దళ నాయకుడు మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నాడు. చివరికి అతడు కూడా రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. ఈవిషయం వంగపహాడ్‌లో చర్చనీయాంశంగా మారింది.

గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్

- లక్ష్మి టౌన్‌షిప్‌లో అధ్యక్షుడి ఇంటిపై దాడి
- ప్రధాన ద్వారం వద్ద గొడ్డలితో బాటసారులపై దాడికి యత్నం
- ఇంతేజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదు

రామన్నపేట : గంజాయి మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. వరంగల్ లక్ష్మి టౌన్‌షిప్‌లో అధ్యక్షుడి ఇంటిపైదాడి చేయడమే కాకుండా దారి కాచి బాటసారులపై సైతం గొడ్డలితో దాడికి యత్నించాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కాలనీ వాసుల కథనం ప్రకారం.. దేశాయిపేట ఎన్.పి. ఆర్‌నగర్‌కు చెందిన కందుకూరి హరి గంజాయి మత్తులో రాత్రి 7.03 సమయంలో టౌన్‌షిప్‌లో అధ్యక్షుడు కొడకండ్ల రామచంద్రమూర్తి ఇంటిపై దాడికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు అప్రమత్తం కావడంతో వెళ్లిపోయాడు. మళ్లీ రాత్రి 9 గంటలకు బండను వారిపై వేయడానికి యత్నించగా మోష్ డోర్ పెట్టడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం రాత్రి 11 గంటల సమయంలో టౌన్ షిప్ ప్రధాన ద్వారం వద్ద గొడ్డలితో వచ్చే వారిపై దాడి చేయడానికి యత్నించే క్రమంలో కాలనీ వాసులు మూకుమ్మడిగా దాడికి దిగడంతో పైడిపల్లి వైపు పరుగులు తీశారు. అనంతరం ఈ గొడ్డలిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడు రామచంద్రమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ గురువారం తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



హన్మకొండ: దసరా పండుగ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ ఆకర్షణీయమైన బహుమతులను ప్రకటించింది. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందించనుంది. ఆర్టీసీ సెమీ డీలక్స్, డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీతోపాటు అన్ని ఏసీ బస్సుల్లో ప్రయాణించేవారు ఈ లక్కీ డ్రాకు అర్హులు. వరంగల్ రీజియన్ పరిధిలో డ్రా తీసి ముగ్గురికి బహుమతులు అందించనున్నారు. మొదటి బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలుగా ప్రకటించింది. ప్రయాణికులు టికెట్ వెనుక వైపు పేరు, ఫోన్ నంబర్, చిరునామా రాసి బస్ స్టేషన్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌ల్లో వేయాలి. వరంగల్ రీజియన్‌లోని హనుమకొండ, వరంగల్, ములుగు, ఏటూరునాగారం, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, జనగామ, పరకాల, భూపాలపల్లి, ఉప్పల్ బస్టాండ్‌లో ప్రత్యేక బాక్స్‌లను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ బాక్స్‌ల్లో వేసిన టికెట్లను ఒక చోటుకు చేర్చి వరంగల్ రీజియన్ స్థాయిలో డ్రా తీసి విజేతలను ప్రకటించి నగదు బహుమతి అందిస్తారు.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి



సుఖవంతమైన, సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి. బతుకమ్మ, దసరా పండుగ ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. రద్దీని బట్టి అప్పటికప్పుడు బస్సులు సమకూరుస్తున్నాం. బస్టాండ్లలో డిపో స్థాయి అధికారిని పర్యవేక్షకుడిగా నియమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి లక్కీ డ్రాలో ప్రయాణికులు బహుమతులు గెలుచుకోవాలి.

-డి.విజయభాను, ఆర్ఎం వరంగల్

గుండా ప్రకాశ్‌రావుకు జ్యుడీషియల్ రిమాండ్

- పరకాల సబ్ జైలుకు తరలింపు

వరంగల్ లీగల్ : డిపాజిట్‌దారులను మోసగించిన కేసులో భవిత శ్రీ చిట్‌ఫండ్ చైర్మన్, జీడబ్ల్యూఎంసీ మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావుకు 14 రోజుల (అక్టోబర్ 09 వరకు) జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ హనుమకొండ మొదటి మున్సిఫ్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి సీహెచ్ శ్రావణ స్వాతి గురువారం ఆదేశాలు జారీ చేశారు. భవిత శ్రీ చిట్‌ఫండ్‌లో డిపాజిట్‌దారుడైన పరకాల మండల కేంద్రానికి చెందిన వంగాల పరమానందం అనే వ్యక్తిని చిట్టీ సమయం అయిపోయినా తనకు ఇవ్వాల్సిన డబ్బులు రూ.1,60,89,768 చెల్లించకుండా ప్రకాశ్‌రావు కాలయాపన చేస్తూ మోసగించాడు. దీంతో బాధితుడు హనుమకొండలోని చిట్‌ఫండ్ ప్రధాన కార్యాలయానికి వెళ్లగా సంబంధిత వ్యక్తులు, గుర్తుతెలియని వ్యక్తులు ఆయనను బయటకు వెళ్లగొట్టారు. ఈ విషయం ఎక్కడైనా ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరించారు. రూ.37.50 లక్షల చొప్పున మూడు విడతలుగా చెల్లిస్తామని చెప్పి మొదటి విడత చెల్లించారు. తదుపరి మిగతా డబ్బుల కోసం అడగగా ఎలాంటి సమాధానం చెప్పకుండా మోసగిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో బాధితుడు పరమానందం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో 2024 అక్టోబర్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ప్రకాశ్‌రావును అరెస్ట్ చేసి హనుమకొండ మొదటి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి సీహెచ్ శ్రావణ స్వాతి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా పరకాల సబ్ జైలుకు తరలించారు.

పసిపాప విక్రయ కేసులో నలుగురి అరెస్ట్

నర్సంపేట: పసిపాపను విక్రయించిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నెక్కొండ సీఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేట మండలంలోని టేకులకుంటతండాకు చెందిన వాంకుడోతు యాకూబ్ భార్య మౌనిక జూలై 17న నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో ఆడశిశువుకు జన్మించింది. ఈనెల 18 నుంచి పాప ఇంటి వద్ద కనిపించకపోవడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 21న ఫిర్యాదు చేసింది. వెంటనే ఎస్సై రాజేశ్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మూడో సంతానంగా పుట్టిన పసిపాను వాంకుడోతు యాకూబ్, మౌనిక దంపతులు రూ.50 వేలకు కరీంనగర్‌కు చెందిన తాడూరి రవి, కల్పనకు విక్రయించారు. వెంటనే పసిపాను చైల్డ్‌వెల్ఫేర్ కమిటీకి అప్పగించి, యాకూబ్, మౌనిక దంపతులు, పాపను కొనుగోలు చేసిన రవి–కల్పన దంపతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నాటకాలు ఇతిహాసాల్ని తెలియజేస్తాయి

- మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి
- ఆకట్టుకున్న 'మమ్మల్ని బతకనివ్వండి', 'జగదేకసుందరి సామా' నాటక ప్రదర్శనలు
- ముగిసిన నాటకోత్సవాలు



నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న అతిథులు

హన్మకొండ కల్చరల్: నాటకాలు ఇతిహాసాలను తెలియజేస్తాయని, నాటకాలను చూసే రామాయణ మహాభారత ఇతివృత్తాలను తెలుసుకునేవాళ్లమని తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఎఫ్‌డీసీ వారి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న పందిళ్ల శేఖర్ బాబు స్మారక నాటకోత్సవం–2025 ముగిశాయి. ఈమేరకు గురువారం సాయంత్రం నాటక సమాజాల రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, వనం లక్ష్మీకాంతారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మధుసూదనాచారి, వీనస్ ఐటీఐ అధినేత శ్రీరామోజు సుందరమూర్తి, అడిషనల్ డీసీపీ నల్లమల రవి, ఆర్యవైశ్య నాయకులు గట్టు మహేశ్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. సమాజంలో చైతన్యం కలిగించడం అనేది నాటకాలు, పాటల వల్లనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం విజయవాడ సాంస్కృతిక సమితి వారు ప్రదర్శించిన మమ్మల్ని బతకనివ్వండి నాటకం, కర్నూలు టీజీవీ కళాక్షేత్రం వారు ప్రదర్శించిన జగదేకసుందరి సామా పద్యనాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా నటులు, దర్శకులు బీఎం రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పందిళ్ల రమేశ్‌బాబు, ఆకుల శ్రీకాంత్, మారేడోజు సదానందాచారి, జూలూరు నాగరాజు, డా.వొడపల్లి చక్రపాణి, పందిళ్ల అశోక్ బాబు, కార్యవర్గ సభ్యులు దేవరరాజు రవీంద్రరావు, మాడిశెట్టి రమేశ్, గూడూరు బాలాజీ, కళాకారులు పాల్గొన్నారు.

సీసీఎస్ సభ్యులకు కొత్త పథకాలు


- ఎస్సీఆర్ఈ సీసీఎస్ ప్రెసిడెంట్ చిలుకు స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న చిలుకు స్వామి

కాజీపేట రూరల్: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (ఎస్సీఆర్ఈ సీసీఎస్) లిమిటెడ్ సభ్యులకు కొత్త పథకాలకు రూపకల్పన చేసినట్లు ప్రెసిడెంట్ డాక్టర్ చిలుకు స్వామి అన్నారు. కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం నామినేటెడ్ డైరెక్టర్ దేవులపల్లి రాఘవేందర్ అధ్యక్షతన ఈసీసీఎస్ 11వ నియోజకవర్గ కాజీపేట డెలిగేట్స్ మీటింగ్ జరిగింది. ముఖ్య అతిథిగా చిలుకు స్వామి హాజరై మాట్లాడుతూ కాజీపేటలోని సుమారు 2,900 మంది సీసీఎస్ సభ్యులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26న సికింద్రాబాద్ హెడ్‌ఆఫీస్‌లో జరిగే డైరెక్టర్ల సమావేశంలో కొత్త పథకాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు, ఒకే లోను సిస్టంలో రూ.20 లక్షలు ఇచ్చేందుకు, దీపావళి కానుకగా సభ్యుల ఖాతాలో డివిడెంట్ జమ, నాన్ రికవరీ కేసులకు లీగల్ నోటీసులు పంపించి చట్టపరంగా రికవరీ చేయుట, మరణించిన సొసైటీ సభ్యుడికి ఫెనరల్ కోసం ఇచ్చే రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఈసీసీఎస్ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌యాదవ్, 10వ నియోజకర్గ డైరెక్టర్ ఓవై స్వామి, డెలిగేట్స్ పాక వేదప్రకాశ్, బి.శ్రీనివాస్, ఇ.రాజేందర్, జి.రాజు, సునీల్, నల్ల రమేశ్, ఎల్‌కే యాదవ్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల ప్రగతికి తోడ్పడాలి



మాట్లాడుతున్న జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కో–ఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి

విద్యారణ్యపురి: దివ్యాంగ విద్యార్థుల ప్రగతికి తోడ్పడేలా ఐఈఆర్పీలు, స్పెషల్ ఎడ్యుకేటర్లు కృషి చేయాలని హనుమకొండ జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కో–ఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి కోరారు. బీఎస్ఐ ఆటిజం అండ్ మల్టీస్పెషాలిటీ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) సౌజన్యంతో కాజీపేట బాల వికాసలో శిక్షణ నిర్వహించారు. ఫండమెంటల్ ఆఫ్ హియరింగ్ డెఫ్‌నెస్ అండ్ ఆడియోలాజికల్ మేనేజ్‌మెంట్ శిక్షణలో భాగంగా స్పెషల్ ఎడ్యుకేటర్లకు, ఐఈఆర్పీలకు శిక్షణ ఇచ్చారు. ఇందులో ఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ.. మూడు రోజులపాటు శిక్షణ పొందాక ఇందులో నేర్చుకున్న అంశాలను దివ్యాంగ విద్యార్థులకు అమలు చేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లుగా బీఎస్‌వై ఆటిజం, మల్టీ స్పెషాలిటీ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, వరంగల్ సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజింగ్ కో–ఆర్డినేటర్ కట్ల శ్రీనివాస్, కిరణ్‌కుమార్, నరేశ్, కపిల్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, వరలక్ష్మి, ప్రియాంక, భరత్‌రెడ్డి పాల్గొన్నారు. శిక్షణలో వివిధ జిల్లాల స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఆరేళ్ల బాలుడి మృతి

- నారాయణపురంలో విషాదఛాయలు
- ఇటీవల మెడపై కత్తితో దాడి



మనీష్‌కుమార్(ఫైల్)

కేసముద్రం: అనుమానాస్పదస్థితిలో బాలుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పందుల ఉపేందర్, శిరీష దంపతులకు ఇద్దరు కుమారులు మనీష్‌కుమార్(6), మోక్షిత్ ఉన్నారు. ఉపేందర్ తన తల్లిదండ్రులు ఎల్లయ్య, మంగమ్మతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఎల్లయ్య మేకలు మేపేందుకు ఊరి బయటకు వెళ్లగా, మంగమ్మ పత్తి ఏరడానికి కూలి పనికి వెళ్లింది. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉపేందర్ పని నిమిత్తం వెళ్లాడు. శిరీష తన ఇద్దరు కుమారులతో ఇంటివద్దే ఉంది. సాయంత్రం ఇంట్లో పెద్దకుమారుడు మనీష్‌కుమార్‌ను పడుకోబెట్టి, ఇంటికి కొంతదూరంలో బతుకమ్మ ఆడేందుకు తన చిన్నకుమారుడితో వెళ్లింది. సాయంత్రం కూలి పనికి వెళ్లి వచ్చిన మంగమ్మ తన కోడలు వద్దకు వెళ్లి మనీష్‌కుమార్ ఎక్కడున్నాడని అడిగింది. జ్వరం వస్తే ఇంట్లో పడుకోబెట్టానని ఆమె తెలిపింది. రాత్రి అయినా మనీష్‌కుమార్ అలాగే పడుకుని ఉన్నాడు. అన్నం తినిపించడానికి మంగమ్మ మనుమడిని నిద్రలేపే ప్రయత్నం చేయగా అప్పటికే మనీష్‌కుమార్ మృతి చెంది ఉన్నాడు. దీంతో ఆమె కేకలు పెట్టగా చుట్టుపక్కల వారు వచ్చారు. స్థానిక ఆర్ఎంపీ కూడా బాలుడు మృతి చెందినట్లు తెలిపాడు. బాలుడి మెడ కమిలి ఉండడంతో ఉరివేసి గుర్తుతెలియని వ్యక్తులు చంపి ఉంటారని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గత జూలై 31న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మనీష్‌కుమార్ మెడపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న మనీష్‌కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కాగా, సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి నానమ్మ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వెంటాడిన మృత్యువు..

పందుల ఉపేందర్, శిరీష దంపతులకు ముగ్గురు కుమారులు మనీష్‌కుమార్, మోక్షిత్, నిహాల్ ఉన్నారు. 2025 జనవరి నెలలో ఇంటి ఆవరణంలో ఉన్న నీటిసంపులో పడి చిన్నకుమారుడు నిహాల్ మృతి చెందాడు. ఇప్పుడు పెద్దకుమారుడు మనీష్‌కుమార్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఇలా ఆ కుటుంబాన్ని మృత్యువు వెంటాడుతోంది.